క్లుప్తంగా

డెప్యూటీ కలెక్టర్ల బృందం పర్యటన



నడింపాలెం(ప్రత్తిపాడు): ప్రత్తిపాడు మండలంలో సోమవారం 23 మంది డెప్యూటీ కలెక్టర్ల బృందం పర్యటించింది. నడింపాలెం, తుమ్మలపాలెం గ్రామ పంచాయతీల్లోని సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ షెడ్లను పరిశీలించారు. నిర్వహణ తీరు, తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసే విధానం, వర్మీ కంపోస్టు తయారీ, వాటి ద్వారా వచ్చే ఆదాయ మార్గాలపై పంచాయతీ కార్యదర్శి ఖాజా వారికి వివరించారు. తొలుత ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ ఆవరణలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి డెప్యూటీ కలెక్టర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో రికార్డుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. వెంట ఎంపీడీఓ శ్రీరమ్య, డీపీఓ కార్యాలయ సిబ్బంది కె.శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ ఎం.మోషే పాల్గొన్నారు.

రేపు వైఎస్సార్ సీపీ గృహ సారథుల సమావేశం

పెదకాకాని: ఈనెల 8వ తేదీన వైఎస్సార్ సీపీ గృహ సారథుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు తెలిపారు. వెనిగండ్ల మైత్రి కల్యాణమండపంలో పెదకాకాని, వెనిగండ్ల, కొప్పురావూరు, అగతవరప్పాడు గ్రామాలకు చెందిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య హాజరవుతారన్నారు. అలానే సాయంత్రం 4 గంటలకు పీఏసీఎస్ చైర్‌పర్సన్ భీమవరపు కోటిరెడ్డి కల్యాణమండపంలో సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి నంబూరు, ఉప్పలపాడు, తక్కెళ్ళపాడు, రామచంద్రపాలెం, వెంకటకృష్ణాపురం, తంగెళ్ళమూడి, అనుమర్లపూడి గ్రామాలకు చెందిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు హాజరు కావాలన్నారు.

నేడు జాబ్‌మేళా

కాకుమాను: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉద్యోగ కల్పన, సీడాప్ వారి సంయుక్త ఆధ్వర్యంలో వివిధ ప్రైవేట్ సంస్థల్లో పని చేయుటకు గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జాబ్స్ రీసోర్స్ పర్సన్ వీరాస్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు గుంటూరులోని చుట్టుగుంట సెంటర్‌లోని సీడాప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 7286962778 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

న్యాయ సహాయం అందించడానికి కృషి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.రత్నకుమార్



గుంటూరు లీగల్: సమస్యలు ఎదురైనప్పుడు న్యాయ సహాయం అందించి వారికి అండగా నిలిచేందుకు న్యాయ సేవాధికార సంస్థ పారా లీగల్ వలంటీర్లు, ప్యానల్ న్యాయవాదులు కృషి చేస్తున్నారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నకుమార్ తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సోమవారం ఇంటర్నేషనల్ జస్టిస్ ఇండియా వారితో కలిసి మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ నిర్బంధంపై ఒకరోజు వర్క్ షాప్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో నిర్వహించారు. కె.రత్నకుమార్ మాట్లాడుతూ వన్ స్టాప్ క్రైసిస్ బృందాన్ని ఏర్పాటు చేయడం ద్వారా బాధితులకు అండగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ తరపున విలియమ్ క్రిస్టఫర్ మానవ అక్రమ రవాణా, బాలల అక్రమ నిర్బంధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రేస్ క్రిస్టిఫెర్, ఐజెఎం సభ్యులు, పలువురు న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- మల్లవరంలో గడప గడపకు మన ప్రభుత్వం



మల్లవరంలో ప్రజలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. మండలంలోని మల్లవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన కొందరు కొండ సమీపంలో రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని కోరారు. విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరటంతో వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కారం చూపారు. కొండ ప్రాంతంలోని ప్రజలు వినియోగిస్తున్న తాగునీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూరే విధంగా పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల ద్వారా గ్రామంలోని ప్రతి గడపకు అందజేస్తున్నామని చెప్పారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన దేశంలోనే ఏకైక పార్టీ మన వైఎస్సార్ సీపీ జగనన్న ప్రభుత్వమని తెలిపారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు, దత్తపుత్రుడుకి తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు సూచించారు. సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా జీవించేలా కృషి చేస్తున్న జగనన్నకు మనం ఎల్లప్పుడూ అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, వైస్ ఎంపీపీ దర్శి సుజాత, సర్పంచి ఏరువ పద్మావతి, కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి, గుంటూరు వెస్ట్ తహసీల్దారు సాంబశివరావు, ఎంపీడీఓ శోభరాణి, ఆర్అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరీ, వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మెట్టు వెంకటప్పారెడ్డి, నాయకులు ఏరువ జగన్‌మోహన్‌రెడ్డి, తంగెళ్ల నాగేశ్వరరావు, ముత్యాల నాగరాజు, నల్లమేకల మాధవరావు, కందుకూరి జ్యోతి, మన్నెం లక్ష్మి, బత్తుల వెంకటరావు, బొల్లెద్దుల వెంకట్, ఇంద్ర, మస్తాన్‌రెడ్డి, తలకోల రామ్మోహన్‌రెడ్డి, ఏరువ కోనారెడ్డి, కిక్కురు పున్నారెడ్డి, బత్తుల కోటిరెడ్డి, ఆవుల సుందర్‌రెడ్డి, కోటిలింగారెడ్డి పాల్గొన్నారు.

పేదలందరికీ ఇళ్లు.. ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- తోట్లపాలెంలో 29 గృహ నిర్మాణాలకు శంకుస్థాపన



తోట్లపాలెంలో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

తోట్లపాలెం(చేబ్రోలు): పేదలందరికి గృహ నిర్మాణాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. గ్రామంలో జగనన్న కాలనీలోని 29 గృహ నిర్మాణాలకు సోమవారం శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ సాయంతో పాటు వీఆర్ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిర్మాణాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఇళ్ల స్థలాలు అందించటంతో పాటు గృహ నిర్మాణాలు చేపట్టం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను కుల, మత, వర్గ రాజకీయాలకు అతీతంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సాయంతో పాటు వీఆర్వో స్వచ్ఛంద సంస్థ సహకారంతో నియోజకవర్గ పరిధిలో మంచాలలో 31మంది పేదలకు గృహ నిర్మాణాలను పూర్తి చేయటం జరిగిందన్నారు. తోట్లపాలెంలో కూడా లబ్ధిదారులందరూ ఐక్యతతో త్వరతగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. తోట్లపాలెంలో 1.69 ఎకరాలను రైతుల వద్ద నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసి 59 మందికి ఇళ్ల స్థలాలను పంపిణీ చేయటం జరిగిందన్నారు. టీడీపీ ప్రభుత్వ కాలంలో ఒక్క సెంటు భూమి కొనుగోలు చేసి పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రజలను మభ్యపెట్టి, మోసగించటం, ఎల్లో మీడియా ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చి నిధులు కేటాయిస్తున్నదన్నారు. నాడు – నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ అనూరాధ, ఎంపీపీ కె.సాహితి, ఎంపీటీసీ టి.అంజనాదేవి, కె.ఆశాజ్యోతి, వెంకట సుబ్బయ్య, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పీటర్ దానియేలు, వెళంగిణి రాజు పాల్గొన్నారు.

జిన్నింగ్ మిల్లు వద్ద రైతుల ధర్నా



మిల్లు ఎదుట బైఠాయించి నిరసన నినాదాలు చేస్తున్న రైతులు

గుంటూరు రూరల్: పండించిన పంటను దళారులు కొనుగోలు చేసి నగదు ఇవ్వకుండా తమను మోసం చేశారని జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాలకు చెందిన పత్తి రైతులు నల్లపాడు శివారుల్లోని శ్రీనివాస అండ్ కో పత్తి జిన్నింగ్ మిల్లువద్ద సోమవారం నిరసనకు దిగారు. మిల్లు ఎదుట బైఠాయించి తమ వద్ద మేడా వాసు, వెంకటరావు అనే ఇరువురు కలిసి పత్తిని కొనుగోలు చేసుకుని దానిని విక్రయించుకుని తమకు నగదు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని సుమారు 50 మంది రైతులు వాపోయారు. చిలకలూరిపేట, బలుసుపాడు, పెదకూరపాడు, గనికపూడి, లింగాయపాలెం, నల్లపాడు తదితర గ్రామాల నుంచి సుమారు రూ.60–70 లక్షల రూపాయల విలువైన పత్తిని వెంకటరావు అనే వ్యక్తికి జిన్నింగ్‌కు ఇవ్వగా అతను మేడా వాసు అనే వ్యక్తికి విక్రయించాడని తమకు రావాల్సిన నగదును గురించి అడుగగా సమాధానం ఇవ్వకుండా జాప్యం చేస్తుండటంతో దిక్కుతోచని స్థితిలో మిల్లు ఎదుట బైఠాయించినట్లు చెప్పారు. ఘటన విషయం తెలిసిన నల్లపాడు పోలీస్ స్టేషన్ పోలీసులు మిల్లు వద్దకు చేరుకుని రైతుల ఆందోళన వివరాలను తెలుసుకున్నారు. రైతులు ఇప్పటికై అచ్చంపేటలో దళారులపై పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

స్టెప్‌కాన్‌లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ



ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్‌ను అందించి వారిని ఉన్నత స్థానాలకు చేర్చటం తమ కళాశాల లక్ష్యమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం చౌడవరంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్టెప్‌కాన్ 2023 జాతీయ స్థాయి సదస్సులో తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి ఓవరాల్ చాంపియన్ ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. ఇటీవల విజయనగరం జిల్లాలోని జీఎమ్ఆర్ ఐటీ కళాశాలలో నిర్వహించిన స్టెప్‌కాన్ జాతీయ సదస్సులో దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ పోటీలలో ప్రాజెక్ట్ డిజైన్ పరిశోధన పత్రాలను పేపర్ ప్రజంటేషన్ ద్వారా తమ విద్యార్థులు వివరించారని పేర్కొన్నారు. అదేవిధంగా తమ కళాశాల విద్యార్థులు రూపొందించిన గోకాట్ వాహనానికి ఓవరాల్ చాంపియన్‌షిప్ లభించిందన్నారు. చాంపియన్‌షిప్‌తోపాటు రూ.20 వేల బహుమతిని అందజేశారన్నారు. చాంపియన్ షిప్ సాధించిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

ముగిసిన సత్యదేవుని బ్రహ్మోత్సవాలు



పాత గుంటూరు: రవీంద్రనగర్‌లోని శ్రీ రమా సత్యనారాయణ స్వామి దేవస్థానంలో 46వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. కార్యక్రమంలో భాగంగా ఉదయం విశేష అర్చనలు, నిత్య హోమం, శ్రీ సూక్త హోమం, వసంతోత్సవం, శ్రీ చక్రస్నానము, మహా పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ద్వాదశ ప్రదక్షిణాలు, పవళింపుసేవ తదితర పూజా కార్యక్రమాలలో భక్తులు భక్తి ప్రపత్తులతో పాల్గొన్నారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ గావించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ చావలి గణపతి, రావిపాటి సత్యనారాయణ, కామేశ్వరరావు పర్యవేక్షించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈఓ కెనడీ

బీకేపాలెం(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్యనందించాలని ఎంఈఓ కేఎఫ్ కెనడీ అన్నారు. మండలంలోని బీకేపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రైవేట్ పాఠశాలల కంటే దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచే విధంగా ఉపాధ్యాయులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

9,10 తేదీలలో చెస్ పోటీలు



చేబ్రోలు మెయిన్ రోడ్డులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ర్యాలీ

చేబ్రోలు: చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 9,10వ తేదీలలో నాగార్జున యూనివర్సిటీ పరిధిలో అంతర్ కళాశాలల చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వి.శ్రీదేవి సోమవారం తెలిపారు. యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పి.జాన్సన్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రకాశం, గుంటూరు జిల్లాలకు చెందిన డిగ్రీ కళాశాలల నుంచి 100కు పైగా జట్లు పాల్గొంటాయని తెలిపారు. యూనివర్శిటీ చెస్ టీంను కూడా ఎంపిక చేయనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

విద్యార్థుల ర్యాలీ

కళాశాల ఎడ్యుకేషన్ కమిషనరేట్ ఆదేశాల ప్రకారం చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లి అక్కడ ఇంటర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిగ్రీ కళాశాలలో ఉన్న కోర్సులు, సదుపాయలు, ల్యాబ్స్, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర అంశాల గురించి వివరించి సీనియర్ ఇంటర్ విద్యార్థులు స్థానిక డిగ్రీ కళాశాలలో చేరాలని సూచించారు.

వెటరన్ క్రీడాకారుల అద్భుత ప్రదర్శన



గుంటూరు వెస్ట్ (క్రీడలు): వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో ఈ నెల 2 నుంచి 5 వరకు జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారని జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు రాయపాటి రంగారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నుంచి మొత్తం 15 మంది పాల్గొనగా అందులో 5 పతకాలు సాధించారన్నారు. వీరిలో పతకాలు సాధించిన వారు త్వరలో గోవాలో జరగనున్న జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి



రికార్డు రూంను పరిశీలిస్తున్న ట్రైనింగ్ స్పెషల్ కలెక్టర్ శివన్నారాయణశర్మ

చేబ్రోలు: రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ట్రైనింగ్ స్పెషల్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ అన్నారు. చేబ్రోలు తహసీల్దారు కార్యాలయాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. చేబ్రోలు తహసీల్దారు కె.సుజాత ప్రస్తుతం సెలవులో ఉన్నారు. 15 రోజుల పాటు ట్రైనింగ్ నిమిత్తం ఇక్కడకు వచ్చారు. 15రోజుల పాటు తహసీల్దారు కార్యాలయంలో ఆయన అందుబాటులో ఉంటారు. ఈ సందర్భంగా రికార్డు రూంను పరిశీలించారు. డెప్యూటీ తహసీల్దారు, ఆర్ఐలతో పెండింగ్ రెవెన్యూ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

ప్రైవేటు ఆస్పత్రి నిర్వాకంపై బంధువుల నిరసన



మృతదేహంతో ఆసుపత్రి ముందు ధర్నా చేస్తున్న మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు

గుంటూరు ఈస్ట్: ప్రైవేటు ఆసుపత్రి ఉద్యోగికి మృతి కారణం ఆసుపత్రి యాజమాన్యం వేధింపులేనని మృతుని బంధువులు ఆసుపత్రి ముందు ధర్నాకు దిగారు. మృతుడి భార్య మానస తెలిపిన వివరాల ప్రకారం బొంగరాలబీడు నిరుపేదల కాలనీ 1వలైనులో నివశించే వంగల మహేష్ (32) అరండల్‌పేటలోని ఓ ఆసుపత్రిలో ఫార్మసీ విభాగంలో బిల్లులు, అకౌంట్స్ గుమస్తాగా మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్నాడు. ఆసుపత్రి నిర్వాహకులు రెండు నెలల క్రితం బిల్లుల్లో అవకతవకలు జరిగాయంటూ మహేష్‌ను ఉద్యోగం నుంచి తీసివేశారు. అయితే అకౌంట్స్ మొత్తం సరిచేయాలంటూ తరచూ ఆసుపత్రికి పిలుస్తున్నారు. ఈ క్రమంలో మహేష్ గురువారం ఆసుపత్రికి వచ్చి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం పక్షవాతంతో ఇంట్లో పడిపోయాడు. కుటుంబ సభ్యులు అతనిని తొలుత నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి అనంతరం జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆసుపత్రి యాజమాన్యం వేధింపుల కారణంగానే మహేష్ తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందాడని బంధువులు ఆరోపించారు. మృతదేహాన్ని ఆసుపత్రి వద్దకు తీసుకొచ్చి సెల్లార్‌లో ఉంచారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలంటూ బంధువులు ధర్నాకు దిగారు. అరండల్‌పేట ఎస్‌హెచ్ఓ రామా నాయక్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఒప్పుకోలేదు.

ఏఎన్‌యూ పరిశోధకుడికి డాక్టరేట్



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్(హెచ్ఆర్ఎం) పరిశోధకుడు పెండెం చంద్రబాబుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని ఏఎన్‌యూ దూరవిద్యాకేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ డాక్టర్ కె సోమశేఖర్ తెలిపారు. హెచ్ఆర్ఎం పరిశోధనా పర్యవేక్షకుడు డాక్టర్ బి.నాగరాజు పర్యవేక్షణలో 'రోల్ ఆఫ్ హెచ్ఆర్ ఇన్ ఎంప్లాయి ఎంప్లాయిమెంట్ ఇన్ సెలెక్ట్ హెల్త్ కేర్ యూనిట్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించినట్లు చెప్పారు. చంద్రబాబు గత పది సంవత్సరాలుగా విజయవాడలోని ఆయుష్ ఆస్పత్రిలో హెల్త్ సెక్టార్‌లో పనిచేస్తున్నారు. డాక్టరేట్ అందుకున్న చంద్రబాబుకు ఆయుష్ ఆస్పత్రి యాజమాన్యం, సిబ్బంది అభినందనలు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏ.పికి తీరని ద్రోహం

లక్ష్మీపురం: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కి తీరని ద్రోహం జరిగిందని, ఒక్కటంటే ఒక్క కొత్త ప్రాజెక్టు కేటాయించలేదని విద్యావేత్త బి.సి.హెచ్. అనంతరామయ్య అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బడ్జెట్ సమావేశం పై సోమవారం చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నూతన బడ్జెట్‌లో ప్రత్యేక హోదా, వెనుకబడ్డ జిల్లాల ప్యాకేజీల ప్రస్తావనే రాలేదన్నారు. రాష్ట్ర విభజన జరిగి తొమ్మిదేళ్ళయినా రాష్ట్ర విభజన చట్టంలో రాష్ట్రానికి పేర్కొన్న అనేక హామీలను ఈ బడ్జెట్‌లో పేర్కొనలేదన్నారు. కేంద్ర విద్యా సంస్థలకు గతేడాది కేటాయించిన నిధుల్లో కూడా తగ్గించారని విమర్శించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, విశ్లేషకులు ఎస్.సదాశివం మాట్లాడుతూ పొరుగు రాష్ట్రమైన కర్ణాటకకు కేంద్ర బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు చేసి ప్రక్కనున్న ఆంధ్రప్రదేశ్ పట్ల వివక్షత చూపించటం దారుణమన్నారు.

కనుల పండువగా వీరమ్మ పేరంటాళ్లు తిరునాళ్ల

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య
- అధికసంఖ్యలో తరలివచ్చిన భక్తులు

పెదకాకాని: ఉయ్యూరు వీరమ్మ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. పెదకాకాని ప్రధాన సెంటర్‌లోని పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకుని సోమవారం అమ్మవారి ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. ఐదు రోజులుగా అమ్మవారు తిరునాళ్ల ఉత్సవంలో భాగంగా ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై కొలువుదీరి కొమ్ముల వాయిద్యాలు, కనక తప్పెట్లు నడుమ తక్కెళ్ళపాడు, వెనిగండ్ల, పెదకాకాని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకూ పెదకాకాని పాతూరు ఏరియాలో అమ్మవారి గ్రామోత్సవం జరిగింది. రాత్రి 10 గంటల తరువాత ముదరపోలు పోయుట, గ్రామ సిడి, సింకా వారి బోనం, భక్తులచే సిడిమాను మహోత్సవం నిర్వహించారు. ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సిడిమాను మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు ఉత్సవంగా తరలివచ్చారు. ఆలయ ప్రాంగణమంతా ఆలయం విద్యుత్ కాంతులతో మెరిసింది.

ఆలయ ప్రాంగణం అంతటా రంగుల రాట్నాలు, బొమ్మల బండ్లు, తినుబండారాలు, చెరకుల వ్యాపారులతో సందడిగా మారింది. తిరునాళ్ల మహోత్సవ ఏర్పాట్లను కార్యనిర్వహణాధికారి ఎం.కోటేశ్వరరావు పర్యవేక్షించారు. పెదకాకాని సీఐ బండారు సురేష్ బాబు, సిబ్బంది ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య:

పెదకాకాని వీరమ్మ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అమ్మవారిని దర్శించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఎమ్మెల్యే తిరునాళ్ళ నిర్వహణ, ఏర్పాట్లను పరిశీలించి దేవదాయశాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, బందెల ఉదయ్‌శంకర్ ఉన్నారు.



వీరమ్మ పేరంటాళ్ళు అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య





తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా విద్యుత్ కాంతులలో వీరమ్మ పేరంటాళ్లు ఆలయం, రంగుల రాట్నాల కోలాహలం

నేడు ఉరుసు మహోత్సవాలు

లక్ష్మీపురం: స్థానిక తూర్పు నియోజకవర్గ పరిధిలోని చిన్నబజార్ సెంటర్‌లోని చిన్న మౌలా పంజా ఆషుర్ ఖానాలో హాజరత్‌సయ్యద్ షా ఔలియా, హజరత్ సిద్ధి బాబా సిద్ధిక్ అమ్మాజన్ వారి దర్గాలో ఉరుసు వేడుకలు మంగళవారం నుంచి ప్రారంభం అవుతాయని దర్గా ముతవల్లి ఖాదర్ బాబా సోమవారం వెల్లడించారు.